


# కరపత్రం

SINCE 2014

బుధవారం మే 20, 2026 | సంపుటి : 2 | సంచిక : 218 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4



## యుద్ధప్రాతిపదికన పాలమూరు-రంగారెడ్డి భూసేకరణ

♦ వీలైనంత త్వరగా సేకరణ జరగాలని ఆదేశం ♦ ప్రజాప్రతినిధులతో ప్రాజెక్టులపై సిఎం రేవంత్ సమీక్ష

హైదరాబాద్,మే19 : పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు సంబంధించి భూసేకరణ ప్రక్రియను దగ్గరుండి యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయించాలని సిఎం రేవంత్ రెడ్డి అధికారులు, ప్రజా ప్రతినిధులను ఆదేశించారు. జిల్లాలోని ఇతర ప్రాజెక్టులకు సంబంధించి వీలైనంత త్వరగా భూసేకరణ పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. భూసేకరణ నిధుల విషయంలో జాప్యం జరగకుండా వెంటనే చెల్లింపులు జరిగేలా చూస్తామని సీఎం చెప్పారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎమ్‌సీఆర్‌హెచ్‌ఆర్డీలో సమావేశమయ్యారు. ఉమ్మడి పాలమూరు జిల్లా సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి సీఎం కీలక సూచనలు చేశారు. జిల్లాలోని ఇతర ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్ బిల్లులను చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులపై జిల్లా మంత్రులు సంబంధిత జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించి ప్రాజెక్టుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఈ భేటీలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణరెడ్డి, మధుసూదన్ రెడ్డి, మేఘా రెడ్డి, రాకేశ్ రెడ్డి, వంశీకృష్ణ, వీర్లపల్లి శంకరయ్య, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు పాల్గొన్నారు.




## తెలంగాణలో శాస్త్రీయంగా వ్యర్థాల నిర్వహణ

సుస్థిర పట్టణాభివృద్ధి, సర్క్యులర్ ఎకానమీ దిశగా చర్యలు

### పక్కాగా ఘన వ్యర్థాల నిర్వహణ కార్యక్రమం

■ బయో ఎరువులు, విద్యుత్ ఉత్పత్తికి ప్రాధాన్యం
■ స్వచ్ఛ భారత్ మిషన్ జాతీయ సమీక్ష సమావేశంలో భట్టి

న్యూఢిల్లీ,మే19 : తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన తెలంగాణ విజన్-2047 లక్ష్యాలకు అనుగుణంగా భవిష్యత్ అవసరాలకు సరిపోయే విధంగా, సుస్థిరంగా, సమగ్రంగా, పర్యావరణహితంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి దిశగా ప్రభుత్వం క్యూర్, ప్యూర్, రేర్ అభివృద్ధి విధానాన్ని అనుసరిస్తోందని, ఇందులో కోర్ అర్బన్ రీజియన్, పెరి అర్బన్ రీజియన్, రూరల్ అగ్రికల్చరల్ రీజియన్‌ల సమతుల్య అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు వివరించారు. ఘన వ్యర్థాల నిర్వహణ అనేది ఇకపై కేవలం చెత్త సేకరణకు పరిమితం కాదని, అది వాతావరణ మార్పులకు ప్రతిస్పందన, పర్యావరణ సుస్థిరత, సర్క్యులర్ ఎకానమీ, ఉపాధి కల్పన, ఆర్థిక ఉత్పాదకతలతో నేరుగా అనుసంధానమై ఉందని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా పట్టణ పరిశుభ్రత, పారిశుద్ధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ వ్యవస్థలను మరింత బలోపేతం చేసే లక్ష్యంతో న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో మంగళవారం కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ అధ్యక్షతన ప్రారంభమైన రెండు రోజుల 'స్వచ్ఛ భారత్ మిషన్-అర్బన్ 2.0' జాతీయ సమీక్ష సమావేశానికి తెలంగాణ రాష్ట్రం తరఫున ఉప ముఖ్యమంత్రి శ్రీ భట్టి విక్రమార్క మల్లు హాజరయ్యారు. మొదటి రోజు సమావేశంలో దేశంలోని పట్టణ ప్రాంతాల్లో పరిశుభ్రత, పారిశుద్ధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ, ఇంటింటి చెత్త సేకరణ, వ్యర్థాల శాస్త్రీయ ప్రాసెసింగ్, పాత చెత్త కుప్పల తొలగింపు, వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తి, పీపీపీ విధానాలు, కొత్త ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనల అమలు వంటి అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. రాష్ట్రాలు, నగరాలు అమలు చేస్తున్న అనుభవాలు, ఉత్తమ విధానాలను పరస్పరం పంచుకోవడంపై కూడా సమావేశంలో విస్తృతంగా చర్చించారు.

## పాలమూరు ప్రాజెక్టులను పూర్తి చేయడమే లక్ష్యం

» కెసిఆర్ హయాంలో జరిగిన తప్పులను సరిదిద్దుతాం
» అధికారులతో సమీక్షించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



హైదరాబాద్,మే19 పాలమూరు ప్రాజెక్టులను పూర్తి చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. దేవాదుల, ఎస్ఎల్‌బీసీ, సీతారామ ప్రాజెక్టులతో సమాన ప్రాధాన్యం ఇస్తామని వ్యాఖ్యానించారు. కేసీఆర్ హయాంలో పాలమూరు - రంగారెడ్డి పనులు 90శాతం పూర్తి అయ్యాయన్నది అసత్యమని అన్నారు. బీఆర్ఎస్ నేతలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ధ్వజమెత్తారు. భూసేకరణ లేకుండానే టెండర్లు పిలిచారని విమర్శించారు. మంగళవారం సచివాలయంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ ప్రాజెక్టులపై మంత్రి ఉత్తమ్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై మంత్రి దిశానిర్దేశం చేశారు. పాలమూరుకు కేసీఆర్ హయాంలో జరిగిన అన్యాయాన్ని సరిదిద్దుతామని చెప్పుకొచ్చారు.

మిగతాద్ది 2 లో

## తెలంగాణ కేబినేట్ భేటీ 23కు వాయిదా ?

» సరస్వతీ పుష్కరాల నేపథ్యంలో నిర్ణయం
» 23న యాదగిరిగుట్టలో నిర్వహించే యోచన
» అధికారికంగా ప్రకటించడమే తరువాయి




హైదరాబాద్,మే19 : రాజధాని వెలుపల మరోమారు తెలంగాణ కేబినేట్ సమావేశం జరగనుందని సమాచారం. గతంలో మేడారంలో కేబినేట్ నిర్వహించిన సిఎం రేవంత్ రెడ్డి తాజాగా ఇప్పుడు యాదగిరిగుట్టలో కేబినేట్ నిర్వహించేందుకు ఆదేశంచినట్లు తెలుస్తోంది. ఈ నెల 21 జరగాల్సిన కేబినేట్ సమావేశాన్ని 23న నిర్వహించాలని, అదికూడా యాదాద్రిలో నిర్వహించనున్నట్లు సమాచారం. 21 నుంచి సరస్వతీ అంత్య పుష్కరాల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.




## భూసార ఆరోగ్య పరిరక్షణలో శ్రద్ధ అవసరం

▪ పచ్చిరొట్ట విత్తనాలు, జిప్సం వాడకంపై జాగ్రత్తలు
▪ రైతునేస్తం 92వ ఎపిసోడ్ కార్యక్రమంలో రైతులకు దిశానిర్దేశం

హైదరాబాద్,మే19 : రాష్ట్రవ్యాప్తంగా రైతులకు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడంతో పాటు పంట దిగుబడుల్లో కీలకపాత్ర పోషించే భూసార ఆరోగ్య పరిరక్షణ, రసాయన ఎరువుల వినియోగం తగ్గింపు లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం రైతులకు 50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు, 90 శాతం సబ్సిడీపై జిప్సం ఎరువులను అందిస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ వెల్లడించింది. ఈ నేపథ్యంలో నిర్వహించిన రైతు నేస్తం 92వ ఎపిసోడ్ కార్యక్రమంలో రాష్ట్రంలోని సుమారు 1,600 వేదికల ద్వారా వీడియో కాన్ఫరెన్స్ సౌకర్యంతో రైతులు, వ్యవసాయ అధికారులు ప్రత్యక్షంగా పాల్గొన్నారు.

## పాలమూరు ప్రాజెక్టులపై బిఆర్ఎస్ మోసం

» 90శాతం పూర్తి చేశామని అబద్దాల ప్రచారం
» గత ప్రభుత్వ నిర్లక్ష్యం అంతాఇంతా కాదు
» మండిపడ్డ మంత్రి జూపల్లి కృష్ణారావు



హైదరాబాద్,మే19 బీఆర్ఎస్ నేతలకు పాలమూరు ప్రాజెక్టుల గురించి మాట్లాడే నైతిక అర్హత లేదని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. 2015లో అప్పటి సీఎం కేసీఆర్ పాలమూరు ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారని... రెండేళ్లలో పూర్తి చేస్తామన్నారని గుర్తు చేశారు. లక్ష కోట్ల ప్రాజెక్టును పదేళ్లలో రూ.25 వేల కోట్లు మాత్రమే ఖర్చు పెడితే 90 శాతం ఎలా పూర్తి అయినట్లు అని ప్రశ్నించారు. పాలమూరు ప్రాజెక్టు తర్వాత మొదలుపెట్టిన కాళేశ్వరం ప్రాజెక్టును లక్ష కోట్లు ఖర్చు చేసి ఎలా పూర్తి చేశారని నిలదీశారు. పాలమూరు ప్రాజెక్టులపై గత ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యం వహించిందని విమర్శించారు.

మిగతాద్ది 2 లో

## ఆ పిటిషన్లను విచారిస్తాం - సుప్రీంకోర్టు



దిల్లీ: దక్షిణాదిలోని 3 రాష్ట్రాలు, ఓ కేంద్ర పాలిత ప్రాంతంలో హిందూ దేవాలయాలపై రాష్ట్ర ప్రభుత్వ నియంత్రణ చెల్లుబాటు అంశంలో దాఖలైన పిటిషన్లను విచారణకు స్వీకరిస్తున్నట్లు సుప్రీంకోర్టు తెలిపింది. గతంలో దాఖలైన ఈ పిటిషన్ల విషయంలో హైకోర్టులనే ఆశ్రయించాలని ఇచ్చిన ఆదేశాలను ఉపసంహరించుకుంది. గతేడాది ఏప్రిల్‌లో ఇచ్చిన ఉత్తర్వులను వెనక్కి తీసుకుంటున్నట్లు జస్టిస్ బీవీ నాగరత్న ధర్మాసనం ప్రకటించింది. ఏపీ, తెలంగాణ, తమిళనాడుతో పాటు కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరిలో హిందూ దేవాలయాలు, మతపరమైన దానాల నిర్వహణను నియంత్రించే పలు చట్టాల రాజ్యాంగబద్ధతను సవాలు చేస్తూ గతంలో సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. కమిషనర్లకు అధికారాలు, ట్రస్టీల నియామకం, ఆలయ ఖాతాల ఆడిట్, మిగులు నిధుల వినియోగం, ఆలయ ఆస్తుల అన్యాక్రాంతం, హిందూ మత సంస్థలపై రాష్ట్ర పర్యవేక్షణ వంటి అంశాలను సవాల్ చేస్తూ ఈ పిటిషన్లు దాఖలయ్యాయి.



## హెచ్‌సీయూలో విద్యార్థి ఆత్మహత్య

హైదరాబాద్: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ)లో ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎంఏ ఫస్టియర్ చదువుతున్న విద్యార్థి చెరువులో దూకి బలవన్మరణానికి పాల్పడ్డాడు. మృతుడిని పశ్చిమ బెంగాల్ వాసిగా గుర్తించారు. ఈ విషయంపై గచ్చిబౌలి పీఎస్‌కు యూనివర్సిటీ సెక్యూరిటీ సిబ్బంది సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## 20న మందుల షాపుల బంద్



హక్కుల సాధన కోసం ఆలిండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్, డ్రగ్గిస్ట్ పిలుపు మేరకు మే 20న దేశవ్యాప్తంగా సమ్మె నిర్వహిస్తున్నట్లు తెలంగాణ ఛాంబర్ ఆఫ్ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ వెల్లడించింది. సోమవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఛాంబర్ ప్రతినిధులు మాట్లాడారు. ఆన్‌లైన్‌లో మందుల విక్రయాలను నిలిపేయాలని, కార్పొరేట్ సంస్థల అధిక డిస్కౌంట్లను నియంత్రించి నకిలీ మందుల అమ్మకాలను నివారించాలనే డిమాండ్లతో బంద్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

# తెలంగాణలో శాస్త్రీయంగా వ్యర్థాల నిర్వహణ

మొదటిపేజీ తరువాయి
ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న శాస్త్రీయ వ్యర్థాల నిర్వహణ విధానాలు, సుస్థిర పట్టణాభివృద్ధి చర్యలు, స్వచ్ఛత కార్యక్రమాలు, సర్క్యులర్ ఎకానమీ దిశగా చేపడుతున్న కార్యక్రమాలను ఉప ముఖ్యమంత్రి సమావేశంలో వివరించారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం అమలులోకి తీసుకు వచ్చిన ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనలు-2026 దేశంలో వ్యర్థాల నిర్వహణ వ్యవస్థలో కీలక మార్పుకు దారితీస్తున్నాయని తెలిపారు. కొత్త నిబంధనలు సంప్రదాయ చెత్త సేకరణ, డంపింగ్ విధానాలకే పరిమితం కాకుండా, 4-వే సోర్స్ సెగ్రిగేషన్, వికేంద్రీకృత వ్యర్థాల ప్రాసెసింగ్, పాత డంప్‌యార్డుల శాస్త్రీయ శుద్ధి, వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తి, సాంకేతిక ఆధారిత పర్యవేక్షణ, సర్క్యులర్ ఎకానమీ, వార్డు స్థాయి బాధ్యత, ప్రజల భాగస్వామ్యం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తున్నాయని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఈ దిశగా నిబంధనలు అమలులోకి రాకముందే పలు చర్యలు ప్రారంభించిందని వివరించారు.

రాష్ట్రంలోని కోర్ అర్బన్ ప్రాంతాల్లో దాదాపు 9,596 ఎలక్ట్రిక్ స్వచ్ఛ ఆటో టిప్పర్లను ప్రవేశపెట్టే ప్రక్రియను తెలంగాణ ప్రభుత్వం చేపడుతోందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ఈ వాహనాల ద్వారా మున్సిపల్ కార్యకలాపాల్లో కార్బన్ ఉద్గారాలు తగ్గడంతో పాటు, శుభ్రమైన రవాణా విధానానికి మార్గం సుగమం అవుతుందని అన్నారు. వీటిని 4-వే సోర్స్ సెగ్రిగేషన్‌కు అనుగుణంగా విభజిత చెత్త నిల్వ స్థలాలతో రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఖీఖీ కోడ్ ఆధారిత పర్యవేక్షణ ద్వారా ఇంటింటి చెత్త సేకరణను మరింత సమర్థవంతంగా అమలు చేయనున్నట్లు చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం వికేంద్రీకృత, పంపిణీ ఆధారిత వ్యర్థాల ప్రాసెసింగ్ వ్యవస్థలకు ప్రాధాన్యం ఇస్తోందని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. తడి చెత్తను ఉత్పత్తి అయిన ప్రాంతాల సమీపంలోనే ప్రాసెస్ చేయడం, పొడి చెత్తను శాస్త్రీయంగా వేరు చేసి రీసైక్లింగ్ మరియు సర్క్యులర్ ఎకానమీ వ్యవస్థల్లోకి తీసుకురావడం, ల్యాండ్‌ఫిల్ ప్రాంతాలకు కనిష్ట వ్యర్థాలు మాత్రమే చేరేలా చేయడం ప్రభుత్వ విధానమని వివరించారు. తడి చెత్తను నగరాల్లో దూర ప్రాంతాలకు తరలించడం వ్యయభారంతో కూడుకున్నదిగా ఉండటమే కాకుండా, పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా కూడా సుస్థిర విధానం కాదని ఉప ముఖ్యమంత్రి తెలిపారు.అందుకే వికేంద్రీకృత తడి చెత్త ప్రాసెసింగ్ కేంద్రాల ద్వారా స్థానిక స్థాయిలోనే వ్యర్థాలను శాస్త్రీయంగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. డంప్‌యార్డుల శాస్త్రీయ శుద్ధి తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించిన అంశమని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. హైదరాబాద్‌లోని జవహర్‌నగర్ డంప్ యార్డ్ విషయంలో ఐఐటీ బాంబే సాంకేతిక సహకారం, సలహా సేవలను పొందుతున్నట్లు ఉప ముఖ్యమంత్రి తెలిపారు. దీని లక్ష్యం మొక్కుబడి చర్యలకే పరిమితం కాకుండా, దీర్ఘకాలిక పర్యావరణ నిర్వహణ వ్యూహాన్ని రూపొందించడం, నిరంతర పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయడమని పేర్కొన్నారు. అలాగే ఆటోనగర్ డంప్ సైట్‌లో సుమారు 40 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న 22 లక్షల మెట్రిక్ టన్నుల వ్యర్థాలను బయోమైనింగ్ ద్వారా ప్రాసెస్ చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు దాదాపు 30 శాతం వ్యర్థాలు ప్రాసెస్ అయ్యాయని వివరించారు. స్వాధీనం చేసుకున్న భూమిని మళ్లీ డంపింగ్ కోసం కాకుండా, భవిష్యత్తులో పార్కులు, క్రీడా సదుపాయాలు, ప్రజా వినియోగ మౌలిక సదుపాయాలుగా అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వం ఆలోచిస్తోందని తెలిపారు. 99 రోజుల ప్రజాపాలన?ప్రగతి ప్రణాళిక కింద పట్టణ స్థానిక సంస్థలు, జిల్లా యంత్రాంగాలు రాష్ట్రవ్యాప్తంగా విస్తృత స్థాయిలో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాయని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. కార్యక్రమాలు విడివిడిగా చేపట్టిన పారిశుద్ధ్య చర్యలు కాదని, తెలంగాణ విజన్?2047కు అనుగుణంగా పట్టణాల సమ్మిళిత అభివృద్ధికి దోహదపడే సమగ్ర కార్యాచరణలో భాగమని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. జపాన్ దేశంలోని కిటాక్యుషు నగర అభివృద్ధి మోడల్ ఆధారంగా బండరావిర్యాల, సిద్దాపూర్ ప్రాంతాల్లో ప్రతిపాదించిన ఎకో టౌన్ తెలంగాణ సర్క్యులర్ ఎకానమీ ప్రయాణంలో ముఖ్యమైన ముందడుగని ఆయన పేర్కొన్నారు. 2047 నాటికి భారత్‌ను 30?35 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న కేంద్ర ప్రభుత్వ లక్ష్య సాధనలో, తెలంగాణ రాష్ట్రం తన 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యంతో కీలక పాత్ర పోషించేందుకు సిద్ధంగా ఉందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ సహా జాతీయ పరిశుభ్రత, పట్టణ పారిశుద్ధ్య ర్యాంకింగ్స్‌లో తెలంగాణ రాష్ట్రం నిరంతరం మెరుగైన ప్రదర్శన కనబరుస్తోందని, ఇది పౌరులు, పారిశుద్ధ్య కార్మికులు, స్థానిక సంస్థలు, ప్రభుత్వం కలిసి చేస్తున్న కృషికి నిదర్శనమని తెలిపారు. పరిశుభ్రత అనేది కేవలం నగరాల రూపురేఖలకు సంబంధించిన విషయం మాత్రమే కాదని, అది ప్రజారోగ్యం, మానవ గౌరవం, జీవన ప్రమాణాలతో ముడిపడి ఉందని ఉప ముఖ్యమంత్రి అన్నారు. వ్యర్థాల నిర్వహణను పారిశుద్ధ్య కార్యక్రమంగా మాత్రమే కాకుండా, ఆర్థిక విలువ సృష్టించే ఉద్యమంగా ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. పరిశుభ్రత ప్రజల జీవనశైలిలో భాగం కావాలంటే చిన్ననాటి నుంచే విద్యార్థుల్లో అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. జపాన్ తరహాలో మొదటి తరగతి నుంచే పాఠశాలల్లో పరిశుభ్రత, వ్యర్థాల వేర్పాటు, పర్యావరణ బాధ్యత వంటి అంశాలను ఆచరణాత్మకంగా బోధించే అంశాన్ని అన్ని రాష్ట్రాలు పరిశీలించాలని ఆయన సూచించారు. ప్రజలు, స్థానిక సంస్థలు, పారిశుద్ధ్య కార్మికులు, పరిశ్రమ భాగస్వాములు, వివిధ సంస్థల సహకారంతో తెలంగాణ సుస్థిర పట్టణ నిర్వహణ, శాస్త్రీయ వ్యర్థాల నిర్వహణ, సర్క్యులర్ ఎకానమీ అభివృద్ధిలో దేశానికి ఆదర్శంగా నిలుస్తుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విశ్వాసం వ్యక్తం చేశారు. సమావేశంలో పట్టణ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి తోఖన్ సాహు, కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ కార్యదర్శి శ్రీనివాస్ కటికితల,స్వచ్ఛ భారత్ మిషన్ డైరెక్టర్ రూపా మిశ్రా లతో సహా సంబంధిత కేంద్ర ప్రభుత్వ అధికారులు, తెలంగాణ రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, ముఖ్యమంత్రి కార్యదర్శి మానిక్ రాజ్, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఆర్వీ కర్ణన్‌తో పాటు వివిధ రాష్ట్రాల పట్టణాభివృద్ధి శాఖ మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## పాలమూరు ప్రాజెక్టులను పూర్తి చేయడమే లక్ష్యం

మొదటిపేజీ తరువాయి
జూరాల ప్రాజెక్టులో పూడిక తొలగించి నిల్వ సామర్థ్యం పెంచుతున్నట్లు తెలిపారు. జూరాల అభివృద్ధికి ప్రతిపాదనలు చేశామని వివరించారు. వర్షాకాలానికి ముందే చెరువుల్లో పూడికతీత పనులు చేపడతామని స్పష్టం చేశారు. పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి చేస్తామని తెలిపారు. 12.30 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. 1226 గ్రామాలకు తాగునీరు అందిస్తామని తెలిపారు. 15 రోజుల్లో మరోసారి ప్రగతి సమీక్ష నిర్వహిస్తామని చెప్పుకొచ్చారు. ఆయా ప్రాజెక్టుల పురోగతిపై సమగ్ర నివేదికలు ఇవ్వాలని అధికారులను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు.

## పాలమూరు ప్రాజెక్టులపై బిఆర్ఎస్ మోసం

మొదటిపేజీ తరువాయి
గట్టు, కల్వకుర్తి, జూరాల, కోయిల్ సాగర్, భీమా అన్ని ప్రాజెక్టుల విషయంలో పక్షపాతం చూపారని మంత్రి మండిపడ్డారు. కల్వకుర్తి పంపులు బాగు చేయలేకపోయారన్నారు. పాలమూరు ప్రాజెక్టు నీటి కేటాయింపులు సాధించలేకపోయారని తెలిపారు. కృష్ణా నీటిని పదేళ్లు ఏపీకి తాకట్టు పెట్టారని ఆరోపించారు. రాయలసీమను రతనాల సీమ చేస్తామని చెప్పింది బీఆర్ఎస్ కాదా అని ప్రశ్నించారు. గద్వాల్‌లోని ర్యాలంపాడు రిజర్వాయర్‌ను పదేళ్లలో రిస్టోర్ చేయలేదన్నారు. పాలమూరు ప్రాజెక్టుల విషయంలో సీఎం రేవంత్ రెడ్డితో స్వయంగా ఎమ్మెల్యేలు, మంత్రులు కలిసి చర్చించామని చెప్పారు. సీఎం కూడా పాలమూరు వాసి కాబట్టి.. ప్రాజెక్టుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ పెట్టామని, పనులను పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. కల్వకుర్తి కింద చేపట్టనున్న గొల్లపల్లి రిజర్వాయర్‌ను చేపట్టవద్దని బీఆర్ఎస్ నేతలు ఆందోళనలు చేస్తున్నారని మంత్రి జూపల్లి కృష్ణారావు మండిపడ్డారు

## 20న మందుల షాపుల బంద్

మొదటిపేజీ తరువాయి
ఈ సందర్భంగా ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు.

**ఆ మెడికల్ స్టోర్లు పనిచేస్తాయ్**

ఆలిండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్స్, డ్రగ్గిస్ట్స్ పిలుపు నేపథ్యంలో దేశవ్యాప్తంగా బుధవారం మందుల దుకాణాలు మూతపడనున్నాయి. అయితే, ప్రధాన ఫార్మసీ చైన్ అవుట్‌లెట్లు, జన ఔషధీ కేంద్రాలు, ఆసుపత్రి కేంద్రంగా పనిచేసే మెడికల్ స్టోర్లు, అమృత్ ఫార్మసీ ఔట్‌లెట్లు మాత్రం తెరిచే ఉంటాయని అధికారిక వర్గాలు తెలిపాయి. ఈ సమ్మె నుంచి కొన్ని రాష్ట్రస్థాయి ఫార్మసీ సంఘాలు ఇప్పటికే వైదొలిగాయి. పశ్చిమ బెంగాల్, కేరళ పంజాబ్, మహారాష్ట్ర, కర్ణాటక, హరియాణా, ఉత్తర్‌ప్రదేశ్, లద్దాక్, గుజరాత్, ఛత్తీస్‌గఢ్, సిక్కిం, ఉత్తరాఖండ్‌కు చెందిన రిటైల్ ఫార్మసీ అసోసియేషన్లు సమ్మెలో పాల్గొనడం లేదని లిఖితపూర్వకంగా లేఖ ఇచ్చాయి. మిగిలిన రాష్ట్రాల్లో మాత్రం సమ్మె ప్రభావం కనిపించనుంది.

**అత్యవసర మందుల కోసం టోల్‌ఫ్రీ**

మెడికల్ దుకాణాల బంద్ నేపథ్యంలో ప్రజలకు తెలంగాణ డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ కీలక సూచన చేసింది. ఒకవేళ అత్యవసర మందులు దొరకకపోతే స్థానిక డ్రగ్ కంట్రోల్ అధికారిని సంప్రదించాలని సూచించింది. అధికారుల నంబర్లు, అడ్రస్ వివరాలు డీసీఏ వెబ్‌సైట్‌లో కీ కాంటాక్ట్స్ విభాగంలో అందుబాటులో ఉంటాయని తెలిపింది. ప్రజలు ఏదైనా సాయం కోసం డీసీఏ టోల్ ఫ్రీ నంబర్ 1800 599 6969కి కాల్ చేయొచ్చని సూచించింది. ఆస్పత్రులకు అనుబంధంగా ఉన్న మెడికల్ షాప్స్ తెరిచే ఉంటాయని ప్రకటించింది. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూసేందుకు డీసీఏ అన్ని చర్యలూ తీసుకుంటుందని హామీ ఇచ్చింది.

## జలమండలిలో భారీ తిమింగలం

హైదరాబాద్ జలమండలిలో భారీ తిమింగలం పట్టుబడింది. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టిన జనరల్ మేనేజర్ కుమార్ నివాసంలో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించగా భారీ ఎత్తున నగదు, నగలు, ఆస్తుల చిట్టాలు బయటపడ్డాయి. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఈ తనిఖీలు చేపట్టారు. మంగళవారం తెల్లవారుజాము నుంచే ఏసీబీ అధికారులు బృందాలుగా ఏర్పడి.. హైదరాబాద్‌తో పాటు మొత్తం 8 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. మల్లాపూర్‌లోని కుమార్ ఇంట్లో ఏసీబీ డీఎస్పీ మజీద్ అలీ ఖాన్ ఆధ్వర్యంలో తనిఖీలు ప్రారంభించారు. జీఎం కుమార్ బంధువుల ఇళ్లలోనూ సోదాలు కొనసాగాయి. ఈ తనిఖీల్లో భారీగా నగదును ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కుప్పలుగా ఉన్న నోట్ల కట్టలు చూసి అధికారులు ఆశ్చర్యానికి గురయ్యారు. ఇంట్లో ఎక్కడ చూసినా నోట్ల కట్టలే దర్శనమివ్వడంతో.. ఆ నగదు లెక్కింపునకు కౌంటింగ్ మెషీన్లను అధికారులు వినియోగించారు. దాదాపు రూ.1.20 కోట్ల నగదు,1.5 కిలోల బంగారు ఆభరణాలు, 2.5 కిలోల వెండిని స్వాధీనం చేసుకున్నారు. నిజామాబాద్‌లో 3 ఎకరాల వ్యవసాయ భూమి, హైదరాబాద్‌లోని ఓ గేటెడ్ కమ్యూనిటీలో మూడు ప్లాట్‌లు, 6 ఓపెన్ ప్లాట్‌లను అధికారులు గుర్తించారు. బ్యాంకు లాకర్లను ఓపెన్ చేసి మరిన్ని ఆస్తులను గుర్తించేందుకు ఏసీబీ అధికారులు సిద్ధమయ్యారు. మల్లాపూర్‌లోని కుమార్ నివాసంలో 2 కార్లను సీజ్ చేశారు.

## తెలంగాణ కేబినేట్ భేటీ 23కు వాయిదా ?

మొదటిపేజీ తరువాయి
తెలంగాణ రాజకీయాలు, పాలనా నిర్ణయాల్లో ప్రస్తుతం రాష్ట్ర మంత్రివర్గ సమావేశం నిర్వహణ అత్యంత ఆసక్తికరంగా మారింది. ముందుగా అనుకున్న షెడ్యూల్ ప్రకారం కాకుండా, కేబినెట్ సమావేశాన్ని వాయిదా వేసే యోచనలో రేవంత్‌రెడ్డి సర్కార్ ఉన్నట్లు తెలుస్తోంది. దీనికి ప్రధాన కారణం ప్రముఖ పుణ్యక్షేత్రమైన బాసరలో ప్రారంభం కానున్న 'సరస్వతి అంత్య పుష్కరాలు' కావడం గమనార్హం. అదే సమయంలో, ఈ కేబినెట్ భేటీని కేవలం వాయిదా వేయడమే కాకుండా, హైదరాబాద్ వెలుపల మరో ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్టలో నిర్వహించాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి భావిస్తున్నట్లు సమాచారం. 'బాసర సరస్వతి అంత్య పుష్కరాలు' ఈ నెల 21వ తేదీన ప్రారంభం కానున్నాయి. గోదావరి నది తీరాన వెలసిన బాసర క్షేత్రంలో జరిగే ఈ అంత్య పుష్కరాలకు తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాట్లు చేస్తోంది. ఈ చరిత్రాత్మక వేడుకకు రాష్ట్ర మంత్రివర్గంలోని మెజార్టీ మంత్రులు హాజరు కానున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడటం, పుష్కరాల పనులను పర్యవేక్షించడం మంత్రులకు విధిగా మారింది. మంత్రులంతా పుష్కరాల పనుల్లో, అధికారిక పర్యటనల్లో నిమగ్నమవ్వడం, బాసరకు వెళ్లనుండటంతో.. అదే రోజు నిర్వహించాలనుకున్న కేబినెట్ సమావేశాన్ని వాయిదా వేయడమే ఉత్తమమని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. దీంతో ఈ నెల 23వ తేదీన ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట లో కేబినెట్ సమావేశాన్ని నిర్వహించాలని సీఎం రేవంత్‌రెడ్డి యోచిస్తున్నారు. రాజధాని హైదరాబాద్‌లోని సచివాలయానికే పరిమితం కాకుండా, ప్రజలకు, పుణ్యక్షేత్రాలకు దగ్గరగా పాలనను తీసుకెళ్లాలనే ఆలోచనలో భాగంగానే ఈ వ్యూహాన్ని రచిస్తున్నారు. యాదగిరి లక్ష్మీనరసింహస్వామి కొలువై ఉన్న ఈ పవిత్ర క్షేత్రంలో కేబినెట్ భేటీ నిర్వహించడం ద్వారా ఆధ్యాత్మిక, రాజకీయ సందేశాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లవచ్చని సీఎం భావిస్తున్నారు. గతంలో ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతర అయిన సమ్మక్క - సారలమ్మ జాతర సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన మంత్రివర్గ సహచరులతో కలిసి మేడారంలో కేబినెట్ సమావేశాన్ని నిర్వహించారు. అక్కడికక్కడే జాతర ఏర్పాట్లు, భక్తుల సౌకర్యాలు, నిధుల విడుదలపై కీలక నిర్ణయాలు తీసుకుని రికార్డు సృష్టించారు. ఇప్పుడు అదే తరహా వ్యూహాన్ని యాదగిరిగుట్ట లోనూ అమలు చేయాలని చూస్తున్నారు. దీనివల్ల స్థానిక సమస్యలపై తక్షణమే స్పందించే అవకాశం లభిస్తుందని నమ్ముతున్నారు. బాసర అంత్య పుష్కరాల కారణంగా ఈ నెల 21న జరగాల్సిన కేబినెట్ వాయిదా పడటం, దానిని ఈ నెల 23న యాదగిరిగుట్టకు మార్చాలని యోచించడం అందులో భాగమే. అయితే ఈ మార్పుపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

## భూసార ఆరోగ్య పరిరక్షణలో శ్రద్ధ అవసరం

మొదటిపేజీ తరువాయి
కార్యక్రమానికి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ కార్యదర్శి కే. సురేంద్రమోహన్, వ్యవసాయ శాఖ సంచాలకులు బి. గోపి, ఉద్యానవన శాఖ సంచాలకులు యాస్మిన్ భాష, తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదుగా రైతులకు సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు, జిప్సం ఎరువులు పంపిణీ చేసారు. అనంతరం పచ్చిరొట్ట పంటల సాగు, జిప్సం వాడకం ద్వారా భూసార ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్రీదేవి రైతులకు సాంకేతిక వివరాలు తెలియజేశారు. కార్యక్రమంలో భాగంగా వృత్తిరీత్యా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అయినప్పటికీ వ్యవసాయంపై ఆసక్తితో ఆయిల్‌పామ్ సాగు చేస్తూ మంచి లాభాలు పొందుతున్న ఖమ్మం జిల్లా రఘునాథపల్లి రైతు మహేష్ తన అనుభవాలను వివరించారు. జిప్సం వాడకం ద్వారా క్షార ప్రభావిత భూముల్లో సాధించిన ఫలితాలను, ఉద్యాన పంటల్లో వచ్చిన లాభాలను సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం రంజోల్ గ్రామానికి చెందిన నాగేశ్వర్ రెడ్డి వివరించారు. అలాగే పచ్చిరొట్ట పంటలైన జీలుగ, జనుము సాగు ద్వారా రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించిన అనుభవాలను సిద్దిపేట జిల్లా కోహెడ మండలం శనిగరం గ్రామానికి చెందిన మహేందర్, నిజామాబాద్ జిల్లా ఆలూరు గ్రామానికి చెందిన సూర్యరెడ్డి రైతులతో పంచుకున్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ భూసార ఆరోగ్య పరిరక్షణ ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. పంట దిగుబడుల్లో నేల ఆరోగ్యం కీలకపాత్ర పోషిస్తుందని, రైతులు భూసార పరిరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. భూమిలో సేంద్రియ కర్బనాన్ని పెంపొందించడంతో పాటు రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించడంలో పచ్చిరొట్ట పంటలు ముఖ్యపాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. ఈ క్రమంలో జీలుగ, జనుము, పిల్లిపెసర వంటి పచ్చిరొట్ట విత్తనాలను రైతులకు 50 శాతం సబ్సిడీపై అందిస్తున్నట్లు చెప్పారు. సాయిల్ హెల్త్ అండ్ ఫెర్టిలిటీ పథకం ద్వారా 90 శాతం సబ్సిడీపై జిప్సం ఎరువులు అందిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 22 జిల్లాల్లో 11,456 మెట్రిక్ టన్నుల జిప్సం పంపిణీకి ప్రణాళిక సిద్ధం చేసినట్లు, ఇప్పటికే 10 జిల్లాల్లో 3,523 మెట్రిక్ టన్నుల జిప్సం అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. బ్సిడీపై అందిస్తున్న పచ్చిరొట్ట విత్తనాలు, జిప్సం ఎరువులపై క్షేత్రస్థాయిలో వ్యవసాయ విస్తరణ అధికారులు, మండల వ్యవసాయ అధికారులు రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని మంత్రి ఆదేశించారు. కార్యక్రమం చివరలో రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన రైతులు అడిగిన సాగు సంబంధిత సందేహాలకు వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు సమాధానాలు ఇచ్చారు.

## నేటి నుంచి కోస్తాంధ్రలో మండుటెండలు

# తీవ్రమైన వడగాలులు వీచే ప్రమాదం

**- అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వం హెచ్చరిక**

కోస్తాంధ్ర జిల్లాల్లో పెరుగుతున్న తీవ్ర ఎండలు, వడగాలుల పరిస్థితులపై ఏపీ ప్రభుత్వం అప్రమత్తమైంది. మే 19 నుంచి 'ఫీల్స్ లైక్' ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశముందని హెచ్చరికలు జారీ చేసింది. ముఖ్యంగా మే 20 నుంచి 26 వరకు ఉత్తర, మధ్య కోస్తా జిల్లాల్లో తీవ్రమైన వడగాలులు వీచే అవకాశముందని అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో పట్టణ, స్థానిక సంస్థలకు ప్రభుత్వం అత్యవసర ఆదేశాలు జారీ చేసింది. వచ్చే ఏడు రోజుల పాటు హీట్ వేవ్ సన్నద్ధత చర్యలను కట్టుదిట్టంగా అమలు చేయాలని సూచించింది. ప్రజలకు హీట్ వేవ్ అలర్ట్‌లు, జాగ్రత్తలపై విస్తృత ప్రచారం నిర్వహించాలని, వాట్సాప్, సోషల్ మీడియా, కేబుల్ నెట్‌వర్క్‌ల ద్వారా హెచ్చరికలు అందించాలని ఆదేశించింది. బస్టాండ్లు, మార్కెట్లు, ఆస్పత్రుల్లో తాగునీటి సదుపాయాలు కల్పించాలని.. అవసరమైతే చలివేంద్రాలు, తాత్కాలిక నీటి కియోస్క్‌లు ఏర్పాటు చేయాలని పేర్కొంది. నీటి కొరత ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశాలు జారీ చేసింది. అలాగే కమ్యూనిటీ హాళ్లు, వార్డు సచివాలయాల్లో కూలింగ్ షెల్టర్లు ఏర్పాటు చేయాలని, బస్ స్టాప్‌లు, మార్కెట్లు, జంక్షన్లలో నీడ సదుపాయాలు కల్పించాలని సూచించింది. వృద్ధులు, నిరాశ్రయులు, కార్మికుల కోసం ప్రత్యేక రక్షణ చర్యలు చేపట్టాలని పేర్కొంది. ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ప్రథమ చికిత్స అందుబాటులో ఉంచాలని ఆదేశించింది. మధ్యాహ్న వేళల్లో బయటి పనులు తగ్గించాలని, ఫీల్డ్ పనులను ఉదయం లేదా సాయంత్రం వేళల్లో నిర్వహించుకోవాలని సూచించింది. పారిశుద్ధ్యం, డ్రైనేజీ, తాగునీటి సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు తెలిపింది. తాగునీటి నాణ్యత పరీక్షలు తప్పనిసరిగా నిర్వహించాలని ఆదేశించింది. హీట్ వేవ్ ఫిర్యాదుల కోసం కంట్రోల్ రూమ్‌లు యాక్టివ్‌గా ఉంచాలని, జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్లకు సూచించింది. వార్డు స్థాయిలో నోడల్ అధికారులను నియమించాలనీ ఆదేశించింది. జంతువులు, పక్షుల కోసం నీటి పాత్రలు ఏర్పాటు చేయాలని, హీట్ వేవ్ పరిస్థితులను ప్రతిరోజూ సమీక్షించాలని మున్సిపల్ కమిషనర్లకు సూచించింది. అత్యవసర పరిస్థితులను వెంటనే జిల్లా యంత్రాంగానికి నివేదించాలని వారికి స్పష్టం చేసింది. ఈ మేరకు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సురేశ్ కుమార్ మెమో జారీ చేశారు.

## ప్రజలకు చేరువ కోసమే హైవే స్టేషన్లు

## ట్రాఫిక్ నియంత్రణలకు అధునాతన పద్ధతులు

ప్రజలకు చేరువగా ఉండేందుకు హైవే పక్కన పోలీసుస్టేషన్‌లను ప్రారంభించామని ఆంధ్రప్రదేశ్ డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా వ్యాఖ్యానించారు. ట్రాఫిక్ నియంత్రణకు అధునాతన సాంకేతిక పద్ధతులను వినియోగిస్తామని పేర్కొన్నారు. మంగళవారం కంచరపాలెం ట్రాఫిక్, ఎయిర్ పోర్ట్ ట్రాఫిక్, ఎయిర్ పోర్ట్ క్రైమ్ పోలీస్ స్టేషన్లను డీజీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. విశాఖ ట్రాఫిక్ వింగ్ కోసం ప్రత్యేక ఐపీఎస్ అధికారిని నియమిస్తామని డీజీపీ తెలిపారు. రానున్న రోజుల్లో ఈ స్టేషన్‌లోనే సైబర్ క్రైమ్ స్టేషన్‌ను ప్రారంభిస్తామని చెప్పుకొచ్చారు. కోస్టల్ సెక్యూరిటీ హెడ్‌క్వార్టర్ నూతన కార్యాలయ భవనాన్ని ప్రారంభించామని పేర్కొన్నారు. కోస్టల్ సెక్యూరిటీని బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కోస్టల్ ప్రాంతంలో 21 పోలీసుస్టేషన్లు ఉన్నాయని వెల్లడించారు. ప్రజా భద్రత, మహిళల రక్షణే తమ లక్ష్యమని వ్యాఖ్యానించారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
బుధవారం మే 20, 2026

# న్యాయమూర్తులు కేవలం చట్టమూర్తులు కాదు

బోయిని సత్యనారాయణ, అడ్వకేట్

**▪ బండి భగీరత్ కేసు నేపథ్యం లో మైనర్ వయస్సు చర్చ**

**▪ చట్టం పరిధిని మించి న్యాయమూర్తులు, విచక్షణతో కేసుల విచారణ చేస్తారు**

బండి సాయి భగీరత్ పైన పోలీసులు పెట్టిన పోక్సో కేసు లో మొన్న శనివారం రాత్రి బండి సాయి భగీరత్ పోలీసుల ఎదుట లొంగిపోయి తర్వాత జ్యూడిషల్ కస్టడీకి పంపబడ్డాడు. తెలంగాణ రాష్ట్రంలో దేశమంతటా ఈ కేసు తీవ్ర చర్చకు వచ్చింది.
ఈ కేసు నేపథ్యంలో ప్రజల్లో నేరం, చట్టంపై వివిధ అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.
సమాజ పరిణామం,చట్ట రూపకల్పనలు మరియు అమలు గురించి మేధావులలో ఒక చర్చ మొదలైంది.

**▪ లా చదువుకున్న వాళ్ళు, న్యాయ కోవిదులు, విద్యాధికులు మాత్రమే మేధావులు కాదు. సామాజిక సమస్యలపై లోతుగా స్పందించి పరిష్కారాలు సూచించే ఎవ్వరినైనా మేధావి అనవచ్చు**

పౌరుల వాస్తవిక జీవితంలో నుండి, సమాజంలో జరుగుతున్న సంఘటనల అనుభవంలో నుండి చట్టాలు రూపొందుతాయి. గ్రామాలలో రచ్చబండ దగ్గర పదిమంది గ్రామ పెద్దలు కూర్చుని ప్రజల సమస్యలు విని అర్థం చేసుకుని అందరి ఆమోదంతో ఇచ్చే తీర్పులే చట్టసభల తీర్మానాల ద్వారా చట్టాలుగా మారతాయి.
**పదిమందిలో పరమేశ్వరుడు ఉంటాడు అనేది ఒక నానుడి.కానీ...**
**పదిమంది లో రాక్షసుడు కూడా ఉంటాడు అనేది కూడా ఒక నిజం.**

**▪ చాలా కేసులలో అమాయకులు శిక్షకు గురవుతుంటారు. ఇంకొందరు నిజమైన నేరస్తులు కూడా నిరపరాదులుగా బయట పడుతుంటారు**

కోర్టులలో ప్రవేశపెట్టే సాక్ష్యాల ఆధారంగా న్యాయమూర్తులు తీర్పులు వెలువరిస్తారు. కోర్టులలో ఒక్కొక్క కేసులో ఒక్కొక్క రకమైన తీర్పులు వెలబడుతుంటాయి. ఈ తీర్పులకు వాద ప్రతివాదాలు,సాక్ష్యాలు,చట్టం పై వ్యాఖ్యానాలు కోర్టులో ప్రధాన భూమిక వహిస్తాయి.బండి భగీరత్ కేసు కంటే ముందు సమాజ పరిణామాలు, ప్రభుత్వాల పాలసీలు పనితీరు గురించి కూడా మనం తెలుసుకోవాలి.చట్ట వ్యవస్థ, కార్య నిర్వాహక వ్యవస్థ, న్యాయ వ్యవస్థ లు దేశాన్ని నడుపుతుంటాయి.దేశ పాలన లో నిరవధికంగా మార్పులు చేర్పులు జరుగుతుంటాయి.పాలనా వ్యవస్థలో చట్టం వివిధ రూపాలను తీసుకుంటూ ఉంటుంది. చట్టం అమలు ఎలా ఉంటుందో తెలుసుకుందాం.పోలీస్ స్టేషన్ లలో సారాయి అమ్మకాలు జరిగిన సంగతి అందరికీ జ్ఞాపకం ఉండి ఉంటుంది

**▪ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నక్సలైట్లు (పీపుల్స్ వార్ గ్రూప్ – PWG) సారాయి వేలంపాటలను అడ్డుకుని, 'సారాయి బంద్' పిలుపునిచ్చినప్పుడు, ప్రభుత్వానికి ఆదాయం కోల్పోకుండా ఉండటానికి 1990 వ సంవత్సరంలో పోలీస్ స్టేషన్ లలో రక్షణ నడుమ సారాయి అమ్మకాల కౌంటర్లు నిర్వహించారు**

**▪ బహిరంగంగా మద్యం తాగితే అరెస్టు చేసే పోలీసులే, ప్రభుత్వ ఆదేశంతో పోలీస్ స్టేషన్ లలో మద్యం కౌంటర్లు పెట్టి సారాయి అమ్మారు**

ఎందుకు? అంటే అది ప్రభుత్వ నిర్దేశం.రాష్ట్ర ఆదాయం పెంచడానికి ప్రభుత్వం మద్యం దుకాణాల సంఖ్య పెంచింది,పెంచుతూనే ఉన్నది.ఇది ప్రభుత్వ నిర్ణయం.ఈ నిర్ణయాన్ని అందరూ ఆమోదించాల్సిందే.

**▪ ఈ మద్యం దుకాణాల వద్ద రద్దీ క్రమబద్ధీకరించడానికి ఇప్పుడు కూడా పోలీసులు కనిపిస్తుంటారు.మద్యం తాగి వాహనాలు నడిపితే ఆక్సిడెంట్లు అవుతున్నాయని అదే పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ లో తాగుబోతులను నియంత్రిస్తుంటారు.కేసులు పెడతారు.జైలుకు కూడా పంపుతారు**

మద్యం దుకాణాల అనుమతి ప్రభుత్వ నిర్ణయం.తాగుబోతుల అదుపు చట్టం బాధ్యత.పోలీసులు ఈ రెండు కూడా అమలు చేయాల్సిందే.ఈ మొత్తం వ్యవహారం పై సోషల్ మీడియాలో వస్తున్న విపరీతమైన విమర్శలు అందరికీ తెలుసు.మద్యం వ్యవహారంలో అమ్మకం దుకాణాల అనుమతి..తాగుబోతుల కట్టడి అనే రెండు విషయాల్లో ఏది తప్పు ఏది ఒప్పు? ఈ రెండు విషయాల్లో చట్టమే కరెక్ట్.లోపాలున్నప్పటికీ చట్టమే కరెక్ట్.బహిరంగంగా మద్యం తాగితే అరెస్టు చేయాల్సిన పోలీసులు ఒకనాడు స్వయంగా మద్యం అమ్మారు. పోలీసులు తాగుబోతులను పట్టుకొని కేసులు పెట్టి కోర్టుకు పంపితే శిక్షలు విధించే న్యాయమూర్తులు తాగుబోతులకు శిక్షలు విధిస్తారు.ఈ సందర్భంలో న్యాయమూర్తులు, చట్టమూర్తులుగా మారిపోతారు న్యాయమూర్తుల విధి చట్ట ప్రకారం కేసుల విచారణ చేయడం. న్యాయ అన్యాయ విషయ నిర్ధారణ కోర్టులో న్యాయమూర్తి చేస్తాడు.కేసు న్యాయ నిర్ధారణలో న్యాయమూర్తికి సంపూర్ణ స్వేచ్ఛ ఉంది. సంపూర్ణ విచక్షణ అధికారం ఉంది.ఇక్కడ మనం ఒక విషయాన్ని అర్థం చేసుకోవాలి.సమాజం నిరంతరం పరిణామం చెందుతూ ఉంటుంది. కాలానుగుణంగా పాలనకు అనుగుణంగా ప్రభుత్వాలు చట్టాలు చేస్తాయి. ఆ చట్టాలలో సవరణలు కూడా చేస్తాయి.ఈ మద్యం పాలసీ కూడా అంతే అని మనం అర్థం చేసుకోవాలి. పోలీసులు కూడా ప్రభుత్వ పాలసీని, చట్టాలను అనుసరిస్తారు అమలు చేస్తారు. మైనర్లకు డ్రంక్ అండ్ డ్రైవ్ (Drunk and Drive) లో కఠినమైన శిక్షలు ఉంటాయి. మోటార్ వెహికల్ యాక్ట్ (Motor Vehicles Act) ప్రకారం, మైనర్లు మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం తీవ్రమైన నేరం.

**▪ మైనర్లకు శిక్షలు: మైనర్లపై జువైనల్ జస్టిస్ బోర్డు (Juvenile Justice Board) ద్వారా కేసులు నమోదు చేస్తారు. నేరం యొక్క తీవ్రతను బట్టి మైనర్లను ట్రయల్ యాస్ అడల్ట్ (Trial as an Adult) గా పరిగణించి జైలు శిక్ష విధించే అవకాశం కూడా ఉంటుంద్ని**

ఒకవేళ మైనర్ వయస్సు 16–18 ఏళ్ల మధ్య ఉండి, డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ప్రమాదం జరిగి ఎవరికైనా తీవ్ర గాయాలు లేదా మరణం సంభవిస్తే.. 7 సంవత్సరాల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉంది

**▪ మైనర్ తప్పు చేసినప్పుడు ఆ వాహనానికి సంబంధించిన తల్లిదండ్రులు లేదా యజమానిని బాధ్యులను చేస్తారు. దీని ప్రకారం రూ. 25,000 జరిమానా మరియు 3 సంవత్సరాల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉంది. ఇంతే కాక వాహనం యొక్క రిజిస్ట్రేషన్ ఒక సంవత్సరం (12 నెలలు) పాటు రద్దు చేస్తారు.**

**▪ ఇదే నిబంధనను పోక్సో కేసులో కూడా విధించాలని డిమాండ్ వినిపిస్తున్నది**

మోటార్ వెహికల్స్ యాక్ట్ లో నేరం చేసిన మైనర్ ను ట్రయల్ యాస్ ఎడల్ట్ గా పరిగణించినట్లే, పోక్సో కేసులో కూడా మైనర్ లను ట్రయల్ యాస్ అడల్ట్ గా పరిగణించాలనే సూచనలు బలంగా బహిరంగంగా వినిపిస్తున్నాయి.బండి భగీరత్ కేసు సందర్భంగా మన భారత దేశంలో జరిగిన మైనారిటీ వయస్సు నిర్ధారణ పరిణామ క్రమాన్ని ఒక్కసారి పరిశీలిద్దాం.

## Notified Common Sense is Law

ప్రకటిత ఇంగితజ్ఞానమే చట్టం అనేది న్యాయశాస్త్రంలో అత్యంత ప్రాముఖ్యత కలిగిన సూత్రం

**▪ సమాజంలో మనుషులు సాధారణంగా ఆలోచించే విధానం, సహజ న్యాయం (Natural Justice), మరియు సామాజిక విజ్ఞత ఆధారంగానే చట్టాలు రూపుదిద్దుకుంటాయి**

చట్టం అనేది కేవలం పుస్తకాల్లో రాసి ఉండే క్లిష్టమైన పదాలు కాదు.. అది సమాజం ఆమోదించిన ఇంగితజ్ఞానం (Common Sense).

చట్టాల రూపకల్పనలో ఇంగితజ్ఞానం..Common Sense పాత్ర చాలా కీలకమైనది. చట్టం యొక్క ప్రాథమిక లక్ష్యం సమాజంలో శాంతిభద్రతలను కాపాడటం మరియు న్యాయాన్ని అందించడం. ఒక చట్టం ప్రజలందరికీ అర్థమై, వారు దాన్ని ఆచరించాలంటే, అది వారి దైనందిన జీవితంలో ఉండే సాధారణ వివేకానికి (Common Sense) కట్టుబడి ఉండాలి. అందుకే... సరిగ్గా నియమబద్ధం చేయబడిన, అధికారికంగా ప్రకటించబడిన ఇంగితజ్ఞానమే చట్టంగా మారుతుంది.

**▪ చట్టాల రూపకల్పనలో ఈ పరిజ్ఞానాన్ని ఎలా ఉపయోగిస్తారు?**




ప్రభుత్వాలు లేదా పార్లమెంట్ చట్టాలను తయారు చేసేటప్పుడు కేవలం సాంకేతిక అంశాలనే కాకుండా, సామాజిక స్పృహ మరియు ఇంగిత జ్ఞానాన్ని క్రింది పద్ధతులలో సహజ న్యాయ సూత్రాలు ఉపయోగిస్తారు.

రెండు వైపులా వినడం (Audi Alteram Partem) నేరం మోపబడిన వ్యక్తికి తన వాదనను వినిపించే అవకాశం ఇవ్వాలి అనేది కనీస ఇంగితజ్ఞానం. దీని ఆధారంగానే క్రిమినల్ చట్టాలు రూపొందుతాయి.
సామాజిక అవసరాలు మరియు మార్పులు (Social Adaptability) సమాజంలో వచ్చే మార్పులను బట్టి చట్టాలను ఎప్పటికప్పుడు సవరించడం జరుగుతుంది.

**▪ గతంలో 1949లో అమ్మాయిల వివాహ వయస్సు 15 ఏళ్లుగా ఉండేది. కానీ కాలక్రమేణా విద్య, ఆరోగ్యం, మానసిక పరిణతిపై అవగాహన పెరిగిన తర్వాత, 15 ఏళ్లకే పెళ్లి చేయడం తప్పు అనే ఇంగితజ్ఞానం సమాజంలో బలపడింది**

దాని ఆధారంగానే 1978లో వివాహ వయస్సును 18 ఏళ్లకు పెంచారు.ఇప్పుడు దాన్ని 21 ఏళ్లకు పెంచే ప్రతిపాదనలు వస్తున్నాయి. ఇది కూడా ఈ సామాజిక విజ్ఞతలో భాగమే.

**▪ హేతుబద్ధత మరియు సమానత్వంలి Reasonableness..రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 ప్రకారం చట్టం ముందు అందరూ సమానులే.**

అయితే, ప్రత్యేక వర్గాలైన మహిళలు, పిల్లలు, వెనుకబడిన తరగతులు ప్రత్యేక రక్షణలు కల్పించడం కూడా ఒక ఇంగితజ్ఞానమే.

**▪ ఎందుకంటే సమానత్వం అనేది సమానుల మధ్యే ఉండాలి కానీ, అసమానుల మధ్య కాదు అనే హేతుబద్ధత .. Reasonable Classification ఇందులో ఉంది.**

సాధారణ మానవ ప్రవర్తనను న్యాయ కోవిదులు అంచనా వేస్తారు. వివేకవంతుడైన సాధారణ వ్యక్తి ప్రమాణం.. సాధారణ వ్యక్తి యొక్క వివేకం.. అనే ఒక సూత్రం ఉంది.

## Prudent Man Standard
## Standard of a Prudent Man

ఒక నిర్దిష్ట పరిస్థితిలో ఒక సాధారణ మనిషి ఎలా ప్రవర్తిస్తాడు? అనే పరిజ్ఞానాన్ని బట్టి నేర తీవ్రతను లేదా బాధ్యతను చట్టం నిర్ధారిస్తుంది.ఈ సందర్భంలో మనం ఢిల్లీలో జరిగిన నిర్భయ రేప్ మరియు హత్య గురించి కూడా తెలుసుకోవాలి.

**▪ 2012 డిసెంబర్ 16న ఢిల్లీలో జరిగిన నిర్భయ (జ్యోతి సింగ్) సామూహిక అత్యాచారం, హత్య కేసులో మొత్తం ఆరుగురు వ్యక్తులు పాల్గొనగా, వారిలో నలుగురికి ఉరిశిక్ష పడింది, ఒకరు జైలులోనే ఆత్మహత్య చేసుకుని మరణించారు, మరియు ఒక మైనర్‌కు మూడేళ్ల జైలు శిక్ష పడింది**

ఈ నిర్భయ ఘోరకలి ప్రధాన సూత్రధారి ఒక మైనర్ బాలుడు మొహమ్మద్ అఫ్రోజ్.నేరం జరిగిన సమయానికి అతడికి 17 సంవత్సరాల 6 నెలలు.ఈ దారుణంలో అత్యంత కిరాతకంగా, అమానవీయంగా ప్రవర్తించినట్లు ఆరోపణలు ఎదుర్కొన్నది ఈ మైనర్ బాలుడే.

**▪ అప్పటి భారతీయ చట్టాల ప్రకారం..Juvenile Justice Act ప్రకారం మైనర్లకు గరిష్టంగా 3 సంవత్సరాలు మాత్రమే రిఫార్మ్ హోమ్..ల నేరస్థుల నిర్బంధ కేంద్రం లో శిక్ష విధించే అవకాశం ఉంది. దీంతో జువైనల్ జస్టిస్ బోర్డు అతనికి మూడేళ్ల శిక్ష విధించింది**

తన మూడేళ్ల శిక్షా కాలాన్ని పూర్తి చేసుకుని డిసెంబర్ 2015లో అతను విడుదలయ్యాడు.

**▪ బస్సులో క్లీనర్ గా మరియు కండక్టర్ గా పని చేస్తున్న ఈ బాలుడే నిర్భయను పిలిచి పిలిచి మరీ బస్సు ఎక్కించాడు. అత్యాచారం సమయంలో ఆమెపై అత్యంత క్రూరంగా దాడి చేయడంలో, ఇనుప రాడ్ తో నిర్భయ మర్మాంగంలో తీవ్రమైన అంతర్గత గాయాలు కలిగించడంలో ఇతనే అత్యంత కీలక పాత్ర పోషించాడని సహ-నిందితుల వాంగ్మూలాలు మరియు పోలీసు విచారణలో తేలింది**




ఈ మైనర్ నిందితుడు చేసిన క్రూరత్వానికి కేవలం మూడేళ్ల శిక్ష పడి విడుదల కావడంపై దేశవ్యాప్తంగా తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి.నిర్భయ తల్లిదండ్రుల పోరాటం మరియు ప్రజా నిరసనల ఫలితంగా కేంద్ర ప్రభుత్వం జువైనల్ జస్టిస్ చట్టాన్ని 2015 లో సవరించింది. ఈ కొత్త చట్టం ప్రకారం, 16 నుండి 18 ఏళ్ల లోపు ఉన్న మైనర్లు అత్యాచారం, హత్య వంటి ఘోరమైన నేరాలకు..Heinous Crimes కు పాల్పడితే, వారిని మైనర్లు గా కాకుండా పెద్దవారిగా Adults గా పరిగణించి సాధారణ కోర్టుల్లోనే విచారించి కఠిన శిక్షలు విధిస్తారు.
బండి భగీరత్ పైన కేసు పెట్టిన బాలిక వయస్సు పైన, మానసిక శారీరక పరివర్తన పైన కూడా డిఫెన్స్ న్యాయవాదులు కోర్టులో ప్రశ్నలు లేవనెత్తుతారు.ఈ మైనర్, మేజర్ ల వయస్సు నిర్ధారణ లో న్యాయమూర్తుల విచక్షణ ప్రధాన పాత్ర వహిస్తుంది.మైనర్ బాలిక ఫిర్యాదు పైన పోక్సో కేసు నమోదు చేసే పోలీసులు విచారణ సమయంలో బాలిక ఉద్దేశాలను, మానసిక పరిపక్వతను, శారీరక పరిపక్వతను దృష్టిలో పెట్టుకొని స్టేట్మెంట్ తీసుకోవాలని న్యాయ కోవిదులు కూడా అభిప్రాయపడుతున్నారు.

**▪ ఒక మైనర్ బాలిక తన 15, 16 సంవత్సరాల వయస్సులో తన ఇష్టంతో ఒక మగవాడితో శారీరక లైంగిక సంబంధం పెట్టుకొని, తరువాత ఏవో కారణాలతో ఆ మగవాడిని గనుక చంపి వేస్తే భారతీయ చట్టం ఏమంటుంది?..**

నిర్భయ కేసులో శిక్ష పడ్డ మైనర్ బాలుడి లాగే, హత్య చేసిన మైనర్ బాలికకు కూడా శిక్షలో జువైనల్ జస్టిస్ యాక్ట్ ప్రకారం మినహాయింపు ఉంటుంది.ఆ అమ్మాయి ని మామూలు నేరస్తురాలిగా చూడాలా? లేదా...మైనర్ బాలికగా చూడాలా?.. అనేది కేసు రిజిస్టర్ చేసే పోలీసుల పైనా.. కేసు విచారణ చేసే సంబంధిత న్యాయమూర్తుల పైన ఉంటుంది. అప్పుడు సవరించిన చట్టం ప్రకారం కోర్టు శిక్ష వేస్తుంది.సోషల్ మీడియా, ఇంటర్నెట్ విపరీతంగా ప్రబలిన కారణంగా పసిపిల్లలు సైతం పోర్న్ చూడడం పెరిగింది. ఈ పోర్న్ చూడడంలో మగవారు ఆడవారు అని తేడా లేదు.విచక్షణ తెలియని మైనర్లు ఈ పోర్న్ మూవీలతో విచక్షణ కోల్పోతారు. ఈ అసభ్య అశ్లీల పోర్న్ మూవీలతో మానసిక సంతులనాన్ని కోల్పోతారు.చంచలత్వం పెరిగి కామ ప్రకోపానికి గురవుతారు.ఆ స్థితిలో శారీరక లైంగిక సంబంధాలు పెట్టుకున్న ఒక మైనర్ బాలిక, తరువాత ఏవో కారణాలతో గనుక ఆ అబ్బాయితో విడిపోతే బాలిక తప్పేమీ లేదు. అప్పుడు మగవాడు మాత్రమే శిక్షకు గురవుతాడు. మైనర్ బాలికతో శారీరక లైంగిక సంబంధం పెట్టుకున్న కారణంగా పోక్సో చట్టాల పరిధిలోకి వస్తాడు.

**▪ పరిసరాల ప్రభావంతో,మనము తింటున్న ఫర్టిలైజర్ తిండితో బాలికలు చిన్న వయస్సులోనే రజస్వలలుగా మారుతున్నారు. ఇది సర్వేలు సైన్స్ చెబుతున్న మాట.పిల్లల వయస్సుకు మించిన శారీరక బలిష్టత కలుగుతున్నది.**

శరీర ధర్మాలు తెలియని, నైతికత తెలియని ఆ పసి వయసులో మైనర్ బాలికలు మైనర్ బాలురు కూడా ఆపోజిట్ జెండర్ ఆకర్షణలకు లోనవుతుంటారు.

**▪ ఇక్కడ కేవలం మైనర్ బాలికలు, మైనర్ బాలురు అనే సాంకేతిక విచక్షణ ఒక్కటే సరిపోదు**

మారిన జీవన పరిస్థితులలో వయసుకు మించినటువంటి ఆలోచనలు, శారీరక వికాసాలు కలుగుతున్నాయి. ఈ స్థితిలోనే అవాంఛిత నేరాలు కూడా జరుగుతున్నాయి.

బండి భగీరత్ కేసులో బాలిక మైనర్.
నిర్భయ కేసులో ప్రధాన సూత్రధారి బాలుడు మైనర్
ఈ రెండు కేసుల్లో కూడా మైనర్ లకు ప్రత్యేక వెసులుబాటులు ఉన్నాయి.

**▪ భావోద్వేగాలకు, అభిప్రాయాలకు, రాజకీయాలకు అతీతంగా మేధావులు, న్యాయ కోవిదులు, సామాజిక సేవకులు, రాజకీయ నాయకులు ఎలాంటి భ్రాంతిలేని ఆలోచనలతో చట్టంలో మార్పులకు శ్రీకారం చుట్టాల్సిన అవసరం ఉంది**

**▪ ప్రజలు తమ సామాజిక అనుభవాలు, ఇంగితజ్ఞానం ఆధారంగా ఇచ్చిన సలహాలను పరిగణనలోకి తీసుకుని న్యాయ కోవిదులు చట్టాన్ని సవరిస్తారు**

చట్టాన్ని రూపొందించడమే కాకుండా, దానిని అమలు చేసేటప్పుడు న్యాయమూర్తులు కూడా ఈ సూత్రాన్ని వాడుతుంటారు

**చట్టంలోని కొన్ని నిబంధనలు అస్పష్టంగా ఉన్నప్పుడు, న్యాయమూర్తులు కేవలం అక్షరాలను మాత్రమే చూడకుండా, ఆ చట్టం వెనుక ఉన్న ఉద్దేశాన్ని (Legislative Intent) మరియు ఇంగితజ్ఞానాన్ని బట్టి తీర్పులు ఇస్తారు. ఇవ్వడం న్యాయం కూడ్ని.**

దీనినే Golden Rule of Interpretation అంటారు.

**▪ చట్టాలు అనేవి సమాజం కోసం పుట్టినవి, సమాజం చట్టాల కోసం పుట్టలేదు**

ఇంగితజ్ఞానాన్ని విస్మరించి చేసే ఏ చట్టమైనా ప్రజల తిరస్కరణకు గురవుతుంది. అందుకే, చట్టాల రూపకల్పనలో 'ప్రకటిత ఇంగితజ్ఞానం' .. Notified Common Sense అనేది ఒక దిక్సూచి లాంటిది.
అది చట్టాన్ని మరింత మానవీయంగా, హేతుబద్ధంగా మరియు ఆచరణాత్మకంగా మారుస్తుంది.

**▪ 18 సంవత్సరాల లోపు అమ్మాయి మైనర్. మైనర్ అమ్మాయి ఇష్టంతో అయినప్పటికీ లైంగిక సంబంధం ఏర్పరచుకునే ప్రతి మగవాడు నేరస్తుడే**


మైనర్ అమ్మాయి ప్రోద్బలం తో లైంగిక చర్యలో పాల్గొన్న అబ్బాయి పోక్సో చట్టం ప్రకారం నేరస్థుడే అవుతాడు....ఇది చట్టం
మనోభావాలు బలంగా వినిపిస్తున్న బండి భగీరథ కేసులో అమ్మాయిల ప్రవర్తనలపై కూడా బలమైన విమర్శలు వస్తున్నాయి.
పోక్సో చట్టం నేపథ్యంలో కేవలం అమ్మాయి వయస్సును సాంకేతిక కారణంగా చూపుతూ శిక్షలు విధించడంలో ప్రభుత్వాలు, కోర్టులు మరొక్కసారి లోతైన పరిశీలన జరిపి చట్టాన్ని సవరించాలని, బలోపేతం చేయాలని డిమాండ్ వినిపిస్తున్నది.
మైనర్ అమ్మాయిలు బహిరంగంగా మద్యం సేవిస్తున్నారు. ప్రేమ పేరుతో లైంగిక విచక్షణను కోల్పోయి ప్రవర్తిస్తున్నారు. ప్రైమరీ ఎడ్యుకేషన్ సమయంలోనే అమ్మాయిలు అబ్బాయిలు జరుపుతున్న ప్రేమాయణాలు అందరికీ తెలిసిన విషయమే.

**▪ పోక్సో చట్టం పరిధిలోకి వచ్చే మైనర్ వయస్సు అమ్మాయిల ప్రవర్తనలోని స్వేచ్ఛను ఈ చట్టం రక్షిస్తున్నది. హద్దులు దాటిన స్వేచ్ఛ కొన్నిసార్లు విచ్చలవిడితనాన్ని ప్రతిబింబిస్తున్నది**

**▪ తనకు నచ్చనప్పుడు అమ్మాయి ఈ చట్టాన్ని ఆయుధంగా వాడుతున్న తీరు న్యాయ వ్యవస్థకు న్యాయమూర్తులకు ఒక చిక్కు ముడిగా మారుతున్నది**

ఈ చట్టం అమలులో న్యాయమూర్తులు కేవలం చట్టమూర్తులుగా మారకూడదని న్యాయ కోవిదులు కూడా బహిరంగ విన్నపం చేస్తున్నారు. కాలంలో ఎన్నో మార్పులు వస్తాయి. చట్టం కూడా ఎన్నో మార్పులకు లోనవుతూ ఉంటుంది.
నేరాల అదుపుకు ఎప్పటికప్పుడు చట్టం మారుతున్నట్టుగానే, అమ్మాయిల మానసిక పరిణతి, శారీరక సమర్థత కూడా వయస్సు నిర్ధారణ లో మార్పులకు గురవుతుంది.

**సమాజం నిత్య పరివర్తన చెందుతుంది సమాజంతో పాటు చట్టం కూడా పరివర్తన చెందాల్సిందే**



# జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం... వొడితల ప్రణవ్..

కరపత్రం ప్రతినిధి హుజురాబాద్ మే 19

– జర్నలిస్టులు తీసుకున్న నిర్ణయానికి అభినందిస్తున్న...
– ప్రజా సమస్యల పరిష్కారానికి వారధిగా జర్నలిస్టులు పని చేయాలి.
– జర్నలిస్ట్ కుటుంబానికి ప్రమాద భీమా పోస్టల్ బాండ్ అందజేసిన హుజురాబాద్ ఇంచార్జ్ వొడితల ప్రణవ్..





రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని,ప్రజా క్షేత్రంలో పనిచేసే మీడియా మిత్రులు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా పనిచేయాలని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ కోరారు.మంగళవారం రోజున హుజురాబాద్ పట్టణంలోని హుజురాబాద్ క్లబ్ లో మీడియా సర్వసభ్య సమావేశాన్ని ఏర్పాటు చేశారు.దీనికి ముఖ్య అతిథిగా ప్రణవ్ హాజరయ్యారు.ఈ సందర్భంగా ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన చిర్ర సుదర్శన్ కుటుంబానికి ప్రమాద భీమా పోస్టల్ బాండ్ ద్వారా వచ్చిన ఇన్సూరెన్స్ బాండ్ ను బాధిత కుటుంబానికి ప్రణవ్ చేతుల మీదుగా అందజేశారు.రెండు నిమిషాల పాటు మౌనం పాటించి నివాళులు అర్పించారు.అనంతరం వారు మాట్లాడుతూ కుటుంబానికి పెద్ద దిక్కులా ప్రణవ్ వ్యవహరించడం అడిగిన వెంటనే యూనియన్ లో ఉన్న సభ్యులకు ఇన్సూరెన్స్ డబ్బులు కట్టడం ద్వారా ఒక కుటుంబానికి న్యాయం జరిగిందని భావోద్వేగానికి లోనయ్యారు.అలాగే హుజురాబాద్ పట్టణంలోని వివిధ పాఠశాలలో మంచి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థిని,విద్యార్థులకు ప్రణవ్ చేతుల మీదుగా సన్మానం చేశారు.అనంతరం ప్రణవ్ మాట్లాడుతూ ఇలా అందరినీ ఒకే చోట కలవడం సంతోషంగా ఉందని విద్య,వైద్య విషయంలో ముందు ఉంటామని తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో హుజురాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ సుహాసిని,కౌన్సిలర్లు,ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కాయిత రాములు,ప్రధాన కార్యదర్శి రవీందర్,హుజురాబాద్ పట్టణ,మండల అధ్యక్షులు,మహిళ అధ్యక్షురాల్లు,జర్నలిస్టులు,సీనియర్ నాయకులు,అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# వ్యవసాయంలో పంట మార్పిడి, సేంద్రీయ వ్యవసాయంతో అధిక లాభాలు

కరపత్రం ప్రతినిధి భీమదేవరపల్లి:



రైతులు వ్యవసాయంలో మెలకువలు పాటించాలని వరంగల్ వ్యవసాయ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కోట శివకృష్ణ అన్నారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని గట్ల నర్సింగాపూర్ గ్రామంలో రైతు ముంగిట్లో వ్యవసాయ శాస్త్రవేత్తల కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్కువ యూరియా వాడకం, పంట మార్పిడి విధానం, సమర్థవంతమైన నీటి యాజమాన్య పద్ధతులు, భూసారం పెంచడం, సేంద్రీయ వ్యవసాయంతో లాభాలు పలు మెలకువలు రైతులు తెలుసుకోవాలన్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రజ్ఞ వ్యవసాయంలో యంత్రాలు వాడే విధానాన్ని వివరించారు. మండల వ్యవసాయ అధికారి పద్మ మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొల్లంపల్లి అజయ్ కుమార్, ఉప సర్పంచ్ శ్రీనివాస్, ఏఈఓ శైలజ, వార్డు సభ్యులు అమర్, ఐలయ్య వ్యవసాయ కళాశాల విద్యార్థులు వైష్ణవి, తిరుమలేష్, రైతులు పాల్గొన్నారు.

# రైతులు పండించిన చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం

▪ జమ్మికుంట మక్కల కొనుగోలు కేంద్రంలో వొడితల ప్రణవ్ భరోసా

కరపత్రం ప్రతినిధి జమ్మికుంట మే 19

కాంగ్రెస్ అంటే రైతు ప్రభుత్వం -- రైతులకు అండగా నిలుస్తున్నాం జమ్మికుంట మార్కెట్‌లో మక్కల కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ చైర్మన్ పుల్లూరి స్వప్న సదానందం తో కలిసి సందర్శించిన హుజురాబాద్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జ్ వొడితల ప్రణవ్ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, రైతులు పండించిన ప్రతి గింజకు సరైన ధర కల్పిస్తూ చివరి గింజ వరకు కొనుగోలు చేసే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ వొడితల ప్రణవ్ స్పష్టం చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటోందని ఆయన పేర్కొన్నారు.
జమ్మికుంట పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌లో ఏర్పాటు చేసిన మక్కల కొనుగోలు కేంద్రాన్ని వ్యవసాయ మార్కెట్ చైర్మన్ పుల్లూరి స్వప్న సదానందంతో కలిసి ఆయన సందర్శించారు. కొనుగోలు కేంద్రంలో మక్కలు తీసుకువచ్చిన రైతులను కలిసి వారి సమస్యలు, ఇబ్బందులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు ప్రక్రియ ఎలా కొనసాగుతోందనే విషయాలను అధికారులు, మార్కెట్



సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు.
అనంతరం మీడియాతో మాట్లాడిన వొడితల ప్రణవ్ మాట్లాడుతూ, రైతుల శ్రమ వృథా కాకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఐదు మండలాలకు సంబంధించి జమ్మికుంటలో ఒకే కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, రైతులు సౌకర్యవంతంగా తమ పంటను విక్రయించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని వివరించారు.రైతులకు ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు, మార్కెట్ సిబ్బందితో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటున్నామని ఆయన చెప్పారు. ఇప్పటివరకు మార్క్‌ఫెడ్ ద్వారా సుమారు 72,500 బస్తాలు, 36,250 క్వింటాళ్ల మక్కలు కొనుగోలు చేశామని తెలిపారు. సోమవారం ఒక్కరోజే దాదాపు 10 వేల బస్తాల మక్కలను కొనుగోలు చేయడం జరిగిందని వెల్లడించారు.
రానున్న రెండు నుంచి మూడు రోజుల్లో ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న మక్కల నిల్వలను పూర్తిగా కొనుగోలు



చేసి గోడౌన్లకు తరలించే ప్రక్రియ పూర్తి చేస్తామని ఆయన పేర్కొన్నారు. అనంతరం మళ్లీ మార్కెట్‌లో కొనుగోళ్లు సజావుగా కొనసాగేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.
రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం ఎల్లప్పుడూ రైతులకు అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, రైతుల సమస్యలను పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తామని తెలిపారు.
అనంతరం మార్క్‌ఫెడ్ అధికారులు, జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ పాలకవర్గ సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మక్కల కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని, రైతులు ఎక్కువసేపు ఎదురుచూడకుండా సమన్వయంతో పని చేయాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో మార్కెట్ పాలకవర్గ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వేములవాడలో కౌమార బాలికలకు ఉచిత ఆరోగ్య పరీక్షలు

▪ ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రత్యేక వైద్య శిబిరం



కరపత్రం ప్రతినిధి వేములవాడ

వేములవాడ మున్సిపల్ పరిధిలో "99 రోజుల ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా స్థానిక బస్తీ దవాఖానాలో కౌమార బాలికల కోసం ప్రత్యేక ఆరోగ్య పరీక్షల శిబిరం మంగళవారం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ జి. లోకేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో 15 నుంచి 18 సంవత్సరాల వయస్సు గల బాలికలకు రక్తహీనత, మధుమేహం, శరీర ద్రవ్యరాశి సూచిక వంటి పలు కీలక ఆరోగ్య పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిబిరానికి పట్టణంలోని బాలికలు పెద్ద సంఖ్యలో హాజరై ఆరోగ్య పరీక్షలు చేయించుకుని వైద్యుల సూచనలు పొందారు. ఈ కార్యక్రమంలో మెప్మా ఏఓ ఫసత్ అలీబేగ్, జిల్లా కార్యక్రమ అధికారి నయీం, సీడీపీఓ సౌందర్య, టీఎంసీ భూలక్ష్మి, బస్తీ దవాఖానా వైద్యులు, వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, మెప్మా సిఎల్ఆర్పీలు, ఆర్పీలు పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన ప్రభుత్వ విప్



కరపత్రం ప్రతినిధి వేములవాడ

వేములవాడ పట్టణ పరిధిలోని అర్హులైన 30 మంది లబ్ధిదారులకు 9 లక్షల 83 వేల,వేములవాడ రూరల్ మండల పరిధిలో 13 మంది లబ్ధిదారులకు 4 లక్షల 32 వేల చెక్కులను రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మంగళవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు, వైస్ చైర్మన్ కనికరపు రాకేష్,మున్సిపల్ వైస్ చైర్మన్ నరాల శేఖర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు తూం మధు, కాంగ్రెస్ నాయకులు చంద్రగిరి శ్రీనివాస్, చిలుక రమేష్, కౌన్సిలర్లు తోట రాజు, టైలర్ శ్రీనివాస్,కో ఆప్షన్ సభ్యులు పీర్ మహమ్మద్, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 41వ వర్ధంతి వేడుకలు

▪ సుందరయ్య ఆశయాల సాధనకు కృషి చేయాలి : సీపీఎం జమ్మికుంట టౌన్ కమిటీ

కరపత్రం ప్రతినిధి జమ్మికుంట మే 19

జమ్మికుంట : కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, పేద బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, పీడిత ప్రజల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని సీపీఎం జమ్మికుంట టౌన్ కమిటీ పిలుపునిచ్చింది.
సీపీఎం జమ్మికుంట టౌన్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 41వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.
ఈ సందర్భంగా సీపీఎం టౌన్ కార్యదర్శి దండిగారి సతీష్ మాట్లాడుతూ భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమ



రూపకర్తల్లో పుచ్చలపల్లి సుందరయ్య ఒక ప్రముఖ నాయకుడని అన్నారు. భూస్వామ్య కుటుంబంలో జన్మించినప్పటికీ, భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా నిలబడి రైతులు, కార్మికులు, పేద ప్రజల హక్కుల కోసం పోరాటం చేసిన గొప్ప నాయకుడని కొనియాడారు.
ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తూ జీవితాన్ని ప్రజలకే అంకితం చేసిన వ్యక్తి సుందరయ్య అని పేర్కొన్నారు. దేశ అత్యున్నత సభ అయిన రాజ్యసభలో ప్రతిపక్ష నాయకునిగా ఉన్నప్పటికీ నిరాడంబర జీవనాన్ని కొనసాగించారని, సాధారణ ప్రజల మాదిరిగా సైకిల్‌పై వెళ్లిన నాయకుడిగా గుర్తింపు పొందారని అన్నారు.
అలాగే తనకు ఉన్న 120 ఎకరాల భూమిని భూమిలేని పేదలకు పంపిణీ చేసిన గొప్ప వ్యక్తిత్వం సుందరయ్యదేనని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం, సామాజిక సమానత్వం కోసం ఆయన జీవితాంతం పోరాటం చేశారని అన్నారు.
1985 మే 19న ఆయన మరణించినప్పటికీ, ఆయన ఆశయాలు ఇప్పటికీ సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయని చెప్పారు. నేటి పరిస్థితుల్లో కార్మికులు, రైతులు, దళితులు, బడుగు బలహీన వర్గాల ప్రజలు సుందరయ్య ఆశయ సాధన కోసం మరింత ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో సీపీఎం కమిటీ సభ్యులు వడ్లూరి కిషోర్, జక్కుల రమేష్ యాదవ్, నాయకులు మారపల్లి కిరణ్, ఎస్. మధునయ్య, ఎస్. పోచయ్య, చేరాలు, సీహెచ్. కుమార్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# హ్యూమన్ రైట్స్ కార్యవర్గ సభ్యుల సమావేశం.



కరపత్రం ప్రతినిధి మే 19

మంచిర్యాల జిల్లా ఆల్ ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ హ్యూమన్ రైట్స్ ఆధ్వర్యంలో మీటింగ్ నిర్వహించడం జరిగింది. సభాధ్యక్షులు గా మంచిర్యాల జిల్లా అధ్యక్షులు బెజ్జాల ఆనంద్ నిర్వహించారు .ముఖ్య అతిథులుగా నేషనల్ అధ్యక్షులు డాక్టర్ సురేష్ కుమార్ , హ్యూమన్ వింగ్ నేషనల్ చైర్మన్ ఫిలోమిన , రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మొగిలి సతీష్ , రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎండి సాబీర్, జగిత్యాల జిల్లా అధ్యక్షులు గాజుల శ్రీనివాస్ , కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాపర్తి సాగర్, మంచిర్యాల జిల్లా మహిళా ఉపాధ్యక్షులు మద్రి అపూర్వ, మహిళా సెక్రెటరీ మహమ్మద్ జహీదా , ముఖ్య అతిథులుగా విచ్చేసి కార్యవర్గ సమావేశం 200 మందితో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఇందులో నేషనల్ చైర్మన్ సురేష్ మాట్లాడుతూ పలు హక్కుల గురించి అవగాహన సదస్సు గురించి మాట్లాడటం జరిగింది .చట్టాల గురించి పోక్స్ చట్టం, మహిళలపై జరుగుతున్న అన్యాయాల గురించి మాట్లాడుతూ సభను విజయవంతం చేయడం జరిగింది.

# లండన్ నుంచి వాగ్దేవి విగ్రహం తెప్పించాలి హైకోర్టులో పలు హిందూ సంఘాల పిటిషన్లు

మధ్యప్రదేశ్‌లోని భోజ్‌శాల స్థలం వాగ్దేవి ఆలయానికే చెందుతుందని ఆ రాష్ట్ర హైకోర్టు ఇటీవల తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. దీంతో అక్కడ తాత్కాలికంగా అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించి పూజలు చేస్తున్నారు. ఈ క్రమంలో లండన్‌లోని బ్రిటిష్ మ్యూజియంలో ఉన్న వాగ్దేవి మాత (సరస్వతీ దేవి) విగ్రహాన్ని భారత్‌కు తిరిగి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ పలు హిందూ సంఘాలు స్థానిక హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశాయి. అది తమకు కోహినూర్ కంటే ముఖ్యమైనదని అందులో పేర్కొన్నాయి. మరోవైపు, ఇదే అంశంపై కేంద్ర ప్రభుత్వం, పురావస్తు శాఖతోపాటు రాష్ట్ర ప్రభుత్వానికి హిందూ సంఘాలు లేఖ రాశాయి. ఈ విగ్రహాన్ని తాము కోహినూర్ కన్నా ఎంతో ముఖ్యమైనదిగా భావిస్తున్నామని పిటిషనర్లలో ఒకరైన కుల్‌దీప్ తివారీ పేర్కొన్నారు. ఇది సాంస్కృతిక వారసత్వంతో పాటు మత విశ్వాసంతో ముడిపడి ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం దౌత్య ప్రయత్నాలు
మొదలుపెడితే బ్రిటన్ నుంచి తిరిగి తీసుకురావడం కష్టమైన పని కాదన్నారు. రాజ్‌పుత్‌లకు చెందిన పర్మార్ వంశ భోజ్ రాజు 1034లో ఇక్కడ సరస్వతీ ఆలయాన్ని నిర్మించినట్లు చారిత్రక ఆనవాళ్లు చెబుతున్నాయి. 1305లో మాల్వా ప్రాంతంపై అల్లావుద్దీన్ ఖిల్జీ దండెత్తినప్పుడు ఈ ఆలయం ధ్వంసం చేశారు. తదనంతరం దీనిని దర్గాగా మార్చారు.

# శారీరక సాక్షరత ప్రాముఖ్యం పెరగాలి పుల్లెల గోపీచంద్

గచ్చిబౌలి స్టేడియం వేదికగా నిర్వహించిన యూత్ అండ్ స్పోర్ట్స్ వీక్-2026' కార్యక్రమంలో పద్మభూషణ్ పురస్కార గ్రహీత పుల్లెల గోపీచంద్ 'ఫిజికల్ లిటరసీ' అంశంపై ప్రత్యేక ఉపన్యాసం ఇచ్చారు. తెలంగాణ క్రీడాశాఖ ఆధ్వర్యంలో 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మే 18 నుంచి 23 వరకు ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. యువత సాధికారత, ఫిట్‌నెస్ ప్రోత్సాహం ప్రధాన లక్ష్యాలుగా ఈ వేడుకలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా గోపీచంద్ మాట్లాడుతూ, శారీరక సాక్షరత ప్రాధాన్యత కేవలం క్రీడాకారులకు మాత్రమే కాకుండా సమాజంలోని ప్రతి వర్గానికీ తెలియాల్సిన అవసరం ఉందన్నారు. యువతలో ఆరోగ్యకర జీవనశైలి, క్రమశిక్షణ, మానసిక దృఢత్వం, క్రీడాస్ఫూర్తి పెంపొందించడంలో ఫిజికల్ లిటరసీ కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. క్రీడారంగం దేశానికి కీర్తి ప్రతిష్ఠలు తీసుకువచ్చే ముఖ్యమైన రంగాల్లో ముందుంటుందని, ఆరోగ్యవంతమైన సమాజం అన్ని రంగాల్లో సమగ్ర అభివృద్ధికి దోహదం చేస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో డా. ఎ. సోనిబాలా దేవి మాట్లాడుతూ, రాష్ట్రంలో క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధి, గ్రామీణ స్థాయిలో క్రీడల ప్రోత్సాహంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. యూత్ అండ్ స్పోర్ట్స్ వీక్-2026' ద్వారా శారీరక ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడం, క్రీడల్లో సామాజిక భాగస్వామ్యాన్ని విస్తరించడం, రాష్ట్రంలోని ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించడం లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ డిప్యూటీ డైరెక్టర్లు సుజాత, రవితేజ, గచ్చిబౌలి స్టేడియం అడ్మినిస్ట్రేటర్ కన్నం మధు, కోచ్‌లు మరియు యువ క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.